ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 30.0 | కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 28 అక్టోబరు 2025

పంచాయతీల్లో పంచాయితీ!
- కాంగ్రెస్ నాయకులు, గ్రామ కార్యదర్శులకు మధ్య కోల్డ్‌వార్
- తాము చెప్పింది చేయాలంటున్న నాయకులు
- నిబంధనలకు విరుద్ధంగా చేస్తే మా ఉద్యోగాలు పోతాయంటున్న కార్యదర్శులు

6

సింగిల్ టెండర్‌కే.. జాక్‌పాట్

- 25-30 టెండర్లు వేసిన వాళ్లకు ఒక్కటీ తగల్లేదు
- మద్యం దుకాణాల్లో అంతా సిండికేట్‌మయం
- మహిళలకు దక్కిన 14 దుకాణాలు
- లక్కీ నెంబరు 18.. ఈ నెంబర్‌పై వరించిన 8 దుకాణాలు
- పాలమూరులో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల లక్కీడిప్


లక్కీడిప్ తీసి వచ్చిన నంబర్‌ను చూపుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం టెండర్లలో సింగిల్ టెండరు వేసిన వారికే జాక్‌పాట్ తగలగా, ఎక్కువ టెండర్లు వేసిన వారికి నిరాశే ఎదురైంది. సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీకృత భవనంలో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన 90 దుకాణాలకు లక్కీడిప్ నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. పది చొప్పున దుకాణాలకు సంబంధించిన వ్యాపారులను లక్కీడిప్ తీసే హాలులోకి పంపించారు. అందరికీ కనిపించేలా బయట ఎల్‌ఈడీ స్ర్కీన్‌ను ఏర్పాటు చేశారు. వ్యాపారులంతా సిండికేట్‌గానే టెండర్లు వేశారు. ఒక్కో సిండికేట్‌లో 10-15 మంది వ్యాపారులు ఉన్నారు. కొందరు రెండు, మూడు సిండికేట్‌లలో భాగస్వామ్యం అయ్యారు. లక్కీడిప్‌లో తమకు నెంబర్ తగిలిన వ్యాపారులు ఎగిరిగంతేస్తూ కేరింతలు కొట్టారు. ప్రక్రియ పూర్తయ్యే వరకు కలెక్టర్ అక్కడే ఉన్నారు. దుకాణం వచ్చిన వ్యాపారులు మొత్తం లైసెన్స్ ఫీజులో 1/6 వ వంతు ఫీజు మంగళవారం వరకు చెల్లించాల్సి ఉంటుంది.


దుకాణం దక్కించుకున్న ఆనందంలో వ్యాపారి

ప్రభుత్వ ఉద్యోగికి మద్యం దుకాణం

మహబూబ్‌నగర్‌లో ఓ దుకాణం ప్రభుత్వ ఉపాధ్యాయురాలి పేరిట వచ్చింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు నేరుగా టెండర్లలో పాల్గొనవద్దని, ఆ టెండరును అనుమతించవద్దని ఆ దుకాణానికి పోటీలో ఉన్న వ్యాపారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనవద్దన్న షరతులేమీ లేవని, 21 సంవత్సరాలు నిండిన వాళ్లెవరైనా టెండర్లలో పాల్గొనవచ్చని చెబుతున్నారు. దీనిపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.


కలెక్టరేట్ వద్ద బారులు తీరిన టెండరుదారుల కార్లు

మహిళలకు 14 దుకాణాలు

కొందరు వ్యాపారులు జాతకాలను బట్టి మహిళల పేరిట టెండర్లు వేశారు. మొత్తం 90 దుకాణాలలో 14 దుకాణాలు మహిళల పేరిట వచ్చాయి. మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో 5, జడ్చర్ల పరిధిలో 4, నారాయణపేట సర్కిల్‌లో 2, కోస్గి సర్కిల్‌లో 3 దుకాణాలు మహిళలకు వచ్చాయి.

లక్కీ నెంబర్ 18

మద్యం దుకాణాలలో 18 నెంబరు టోకెన్ పేరిట అత్యధిక దుకాణాలు వచ్చాయి. ఈ నెంబరుపై టెండర్లు వేసిన వ్యాపారులది అదృష్టమనే చెప్పొచ్చు. మొత్తం 90 దుకాణాలలో 18 నెంబరు టోకెన్‌పై 8 దుకాణాలు వచ్చాయి. ఈ నెంబరు తరువాత 3 నెంబరు టోకెన్‌పై 7, 10 నెంబరు టోకెన్‌పై 6 దుకాణాలు వచ్చాయి. కొత్త మద్యం దుకాణాలు డిసెంబరు 1 నుంచి అమలులోకి రానున్నాయి. 2027 నవంబరు 30 వరకు ఈ పాలసీ అమలులో ఉంటుంది.

నగరంలో సిట్టింగ్‌లకే 50 శాతం

పాలమూరు నగరంలో 5 దుకాణాలుండగా అందులో సగం దుకాణాలు సిట్టింగ్‌లకే దక్కాయి. ఫ్రీ జోన్ కావడంతో దుకాణాలు వచ్చిన వారు నగరంలో ఏ ప్రాంతంలోనైనా దుకాణం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. క్రిస్టియన్‌పల్లి వైన్స్‌కు సంబంధించి వ్యాపారులకు వరుసగా మూడోసారి దుకాణాలు రావడం విశేషం.

కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్ తెచ్చింది బీజేపీ ప్రభుత్వమే

- పాలమూరు ఎంపీ డీకే అరుణ


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అరుణ

నారాయణపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా- వికారాబాద్ రైల్వే లేన్‌ను నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం గతంలోనే మంజూరు చేసిందని, అప్పుడే రూ.2,196 కోట్ల నిధులు కేటాయించారని మహబుబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. తాను ఎంపీగా గెలిచిన తర్వాత ప్రత్యేక చొరవ తీసుకుని, కేంద్ర రైల్వే మంత్రిని అనేకమార్లు కలిసి రైల్వేలైన్‌ను సాధించామని చెప్పారు. నారాయణపేట జిల్లాలోని కొల్లంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ముందు తాను ఇచ్చిన హామీ ఈ రైల్వేలైన్ సాధనతో నెరవేర్చానని అన్నారు. ప్రధాని మోదీ గత టర్మ్‌లోనే నిధులు కేటాయిస్తే.. రాష్ట్ర ప్రభుత్వమే తెచ్చిందని కొందరు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సిందే అన్నారు. రైల్వేలైన్ కేంద్ర ప్రభుత్వమే తెచ్చిందనే విషయం ప్రజలకు తెలియాలన్నారు. కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్‌లో కొడంగల్ ముందు నుంచే ఉందని, కానీ కొందరు ఈ రైల్వేలైన్‌ను కొడంగల్- వికారాబాద్ అని రాస్తూ.. ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని చెప్పారు. దీనివల్ల కృష్ణా ప్రాంత వాసులు మరో లైన్ అని భావించాలా? అని ప్రశ్నించారు. కృష్ణా- వికారాబాద్ మార్గం వల్ల ముంబై, గోవా వంటి మహా నగరాలకు వెసులుబాటు కలుగుతుందన్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల తదితర స్టేషన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. అతి త్వరలోనే కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగ్ పాండు రెడ్డి, తిరుపతిరెడ్డి, గోవర్ధన్ గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు కురుమూర్తి స్వామి.. ఉద్దాలోత్సవం


- పల్లమర్రి నుంచి చాట, వడ్డేమాన్ నుంచి ఉద్దాల ఊరేగింపు
- తరలిరానున్న భక్తులు

స్వామివారి పాదుకలు సిద్ధం చేస్తున్న దళితులు

చిన్నచింతకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల కురుమూర్తి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి క్షేత్రం, జాతర మైదానం భక్తజనసంద్రంగా మారనున్నాయి. మండలంలోని పల్లమర్రి గ్రామం నుంచి చాటను ఊరేగింపుగా వడ్డెమాన్ గ్రామానికి తెస్తారు. అక్కడ దళితులు తయారు చేసిన ఉద్దాలను చాటలో ఉంచుతారు. భక్తులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, అధికారులు ఉద్దాలను దర్శించుకుంటారు. తర్వాత తిర్మాలాపూర్, దేవేని చెరువు నుంచి జాతర మైదానానికి తెస్తారు. కురుమూర్తి జాతరకు ఆర్టీసీ 250 ప్రత్యేక బస్సులను నడపనుంది. జాతరకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచీ భక్తులు లక్షల సంఖ్యలో రానుండటంతో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. ఆరు మంది డీఎస్పీలు, 12 మంది సీఐలు, 45 మంది ఎస్‌ఐలు, కానిస్టేబుల్స్, షీ టీమ్స్ ఇలా దాదాపు 651 మందితో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఎస్పీ పర్యవేక్షించనున్నారు.


ఉద్దాల మండపం

ఏర్పాట్లు చేశాం : ఎమ్మెల్యే జీఎంఆర్

జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీటి వసతి, టాయిలెట్స్ సౌకర్యాలు కల్పించాం. జాతరలో జూదం, మట్కా వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టనుంది. భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నాం.

ఆశాల హక్కుల కోసం ఐక్య పోరాటం

- ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి


మాట్లాడుతున్న జయలక్ష్మి

పాలమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్స్ హక్కుల సాధనకోసం ఐక్యంగా పోరాటం చేస్తామని, ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కేంద్రం తక్షణమే ఇండియన్ లేబర్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)రాష్ట్ర 4వ మహాసభలు రెండో రోజు ప్రతినిధుల సభను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్లతో వెట్టిచాకిరి చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 45వ లేబర్ కమిషన్ సమావేశాల్లో నిర్వహించిన సమస్యలను పరిష్కరించకుండా 11 ఏళ్ల నుంచి ఐఎల్‌సీ సమావేశాలు ఏర్పాటు చేయలేదన్నారు. అనేక రకాల ఆశాల సమస్యలను పరిష్కరించడంలో సీఐటీయూ ముందు ఉందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలాదేవి, జె.వెంకటేశ్వర్లు ప్రసంగించారు. రాష్ట్ర నాయకులు కాసు మాధవి, సాధన, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, కిల్లెగోపాల్, ఏ.రాములు, లక్ష్మయ్య, మోహన్, జగన్, టీపీఎస్‌కే జిల్లా కార్యదర్శి వి.కురుమూర్తి, చంద్రకాంత్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

తల్లిని చంపిన తనయుడు

- జల్సాలకు డబ్బు ఇవ్వలేదని ఘాతుకం


భీమమ్మ (ఫైల్)

కొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు డబ్బు ఇవ్వలేదని కన్నతల్లిని కుమారుడు బండరాయితో కొట్టి చంపిన ఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గోకుల్‌నగర్ గ్రామానికి చెందిన భీమమ్మ (58), మొగులప్ప దంపతులకు ఇద్దరు కూతుళ్ళు, ఐదుగురు కుమారులు. కొన్ని సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో చిన్న కొడుకు అయిన రామకృష్ణతో కలిపి భీమమ్మ గోకుల్‌నగర్‌లో నివాసం ఉంటుంది. రామకృష్ణ రెండు సంవత్సరాల క్రితం ఎవరికీ తెలియకుండా ఊరి నుంచి వెళ్లిపోయాడు. అతని సోదరుడు హైదరాబాద్‌తో పాటు వివిధ పట్టణాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన చనిపోయాడని అనుకున్నారు. ఇటీవల ఇన్‌స్టాగ్రాంలో రామకృష్ణ పోస్టులను గ్రామస్థులు గుర్తించారు. దీని ఆధారంగా గోవాలో ఉన్నట్లు గుర్తించి అతని సోదరులు రామకృష్ణను గ్రామానికి తీసుకువచ్చారు. జల్సాలు, మద్యానికి అలవాటుపడ్డ రామకృష్ణ పని చేయక పోవడంతో డబ్బులకు ఇబ్బంది ఏర్పడింది. మతిస్థిమితం కూడా తప్పాడు. అయితే తల్లి కూలీ పనులు చేసి కొడుకును పోషిస్తోంది. కుమారుడి ప్రవర్తనకు భయపడిన తల్లి తన ఇంట్లో కాకుండా ఇరుగుపొరుగు వారి ఇళ్లల్లో రాత్రివేళ నిద్రిస్తుండేది. ఆదివారం రాత్రి ఆసరా పింఛన్‌లో కొంత మొత్తం కుమారుడికి చెల్లించింది. రాత్రి రెండు గంటల సమయంలో తమ ఇంట్లో నిద్రిస్తున్న తల్లి తలపై కుమారుడు బండరాయి, పొడతో కొట్టిచంపాడు. సమాచారం అందుకున్న కోస్గి సీఐ సైదులు, మద్దూరు ఎస్‌ఐ విజయ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని అక్కడే ఉన్న నిందితుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. మృతురాలి రెండో కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మద్దూరు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

జిల్లా క్లబ్ కార్యదర్శిగా సంజీవ్‌ముదిరాజ్

- ఉపాధ్యక్షుడిగా సీమనరేందర్, కోశాధికారిగా రాంచంద్రారెడ్డి


సంజీవ్ ముదిరాజ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా క్లబ్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈయనపై పోటీ చేసిన మల్లు నర్సింహారెడ్డిపై 420 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఆదివారం ఎన్నికలు జరుగగా, కౌంటింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. సోమవారం తెల్లవారుజామున 3 గంటల వరకు కౌంటింగ్ కొనసాగింది. మొత్తం 1,169 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవం అయిన సంగతి తెలిసిందే. మిగతా కార్యవర్గానికి ఉత్కంఠ భరితమైన పోరు సాగింది. సంజీవ్‌ముదిరాజ్‌కు 719 ఓట్లు పోలవగా, మల్లు నర్సింహ్మారెడ్డికి 299 ఓట్లు పడ్డాయి. ఇక ఉపాధ్యక్షులుగా సీమ నరేందర్, గుద్దేటి శివప్రసాద్ మధ్య నువ్వానేనా అన్నట్లుగా పోరుసాగింది. ఇరువురి మధ్య విజయం దోబూచులాడగా సీమనరేందర్ 11 ఓట్ల స్వల్ప ఆధిక్యతతో విజయం సాధించారు. ఆయనకు 512 ఓట్లు రాగా, శివప్రసాద్‌కు 501 ఓట్లు వచ్చాయి. అయితే ప్రత్యర్థి రీకౌంటింగ్‌కు పట్టుబట్టారు. దాంతో ఫలితం పెండింగ్‌లో ఉంచారు. సోమవారం న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన నాగేందర్ సీమనరేందర్ విజయం సాధించినట్లుగా ప్రకటించారు. కోశాధికారిగా గౌని రాంచంద్రారెడ్డి ఘన విజయం సాధించారు. 352 ఓట్ల తేడాతో పెద్ది పెంటయ్యపై గెలుపొందారు. రాంచంద్రారెడ్డికి 650 ఓట్లు రాగా, పెద్ది పెంటయ్యకు 298 ఓట్లు పడ్డాయి. జాయింట్ సెక్రటరీగా ఎన్.శంకర్‌రెడ్డి, స్పోర్ట్స్ జాయింట్ సెక్రటరీగా బుద్దారం రవీందర్‌రెడ్డి విజయం సాధించారు. ఎంసీ మెంబర్లుగా సతీష్‌కుమార్, కె.ఆంజనేయులు, మోహన్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, బాద్మి ధృవ గెలుపొందారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కమలాకర్

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 241 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్చర్ల మండలం మాచారం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ ఆర్ఎన్‌సీసీ యూనిట్, ఈగల్ టీం, జడ్చర్ల పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మాచారంలో ఓ టీ స్టాల్ వద్ద అనుమానాస్పదంగా పారిపోతున్న నలుగురు వ్యక్తులను వెంబడించి పట్టుకుని విచారించగా, గంజాయి కొనుగోలు, విక్రయాలు చేస్తున్నట్లు తేలిందని పేర్కొన్నారు. దాడుల్లో షాద్‌నగర్‌లోని వివేద రెస్టారెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న జడ్చర్ల మండలం మాచారం గ్రామానికి చెందిన మరికంటి సుమంత్‌రెడ్డి, టీషాప్ వ్యాపారం నిర్వహిస్తున్న మహబూబ్‌నగర్ పట్టణంలోని రామయ్యబౌలికి చెందిన అబ్దుల్ రహమన్, సెక్యూరిటీగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న బీహార్ రాష్ట్రం భోజ్‌పూర్ జిల్లా మజహివాన్ గ్రామానికి చెందిన శుభోద్‌కాంత్ శర్మ, సూపర్ వైజర్‌గా పని చేస్తున్న బీహార్ రాష్ట్రం శిపోల్ జిల్లా భవానీపురం గ్రామానికి చెందిన సత్యుయాదవ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు. వారి నుంచి 241 గ్రాముల గంజాయితో పాటు 4 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాడుల్లో పాల్గొన్న జడ్చర్ల ఎస్‌ఐ ఖాదర్, కానిస్టేబుల్స్ విష్ణు, భరత్, నరసింహ, కాశీనాథ్, వీరేశ్, ఆర్ఎన్‌సీసీ, ఈగల్ బృందాలను ఎస్పీ జానకి అభినందించారని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య


రాజశ్రీ (ఫైల్)

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ(35) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని వేంకటేశ్వరకాలనీలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... సోమవారం విధులకు వెళ్లకుండా ఇంట్లో ఉన్న ఆమె తన పిల్లలిద్దరినీ పాఠశాలకు పంపించింది. అనంతరం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అడ్డాకుల మండలానికి చెందిన రాజశ్రీకి నారాయణపేటకు చెందిన శ్యాంసుందర్‌తో వివాహం అయ్యింది. మిడ్జిల్ మండలం వెలుగోముల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఆమె విధులు నిర్వహిస్తుండగా, ఆమె భర్త శ్యాంసుందర్ నారాయణపేటలో మెడికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. పాఠశాలకు వెళ్లిన ఇద్దరు పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంటి తలుపు కొట్టినా తెరవలేదు. దీంతో అదే ఇంట్లో ఉంటున్న ఇంటి ఓనర్‌కు పిల్లలు చెప్పడంతో అతను ఇంటి కిటికీలో నుంచి చూడగా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులు, రాజశ్రీ భర్త శ్యాంసుందర్‌కు సమాచారం అందించాడు. ఆత్మహత్యకు పాల్పడకముందు రాజశ్రీ వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడినట్లు, చాటింగ్ చేసినట్లు ఆమె ఫోన్ ద్వారా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. అయితే రాజశ్రీ ఉంటున్న ఇంటికి మధ్యాహ్నం వేళ ఓ వ్యక్తి వచ్చి తలుపుకొట్టి, కిటికీలో నుంచి చూసి వెళ్లినట్లుగా ఆ ఇంటికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఆ వ్యక్తి ఎందుకు వచ్చారు. కిటికీలో నుంచి చూసి వెళ్లిపోవడానికి గల కారణాలు ఏంటన్నది తెలియాల్సి ఉంది. అయితే రాజశ్రీ ఆత్మహత్యకు పాల్పడడానికి మిడ్జిల్ మండలంలోని ఓ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కారణమై ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని, ఫిర్యాదు వచ్చిన అనంతరం పూర్తి వివరాలు తెలియచేస్తామని జడ్చర్ల పోలీసులు వెల్లడించారు.

మసాలాతో మస్త్ టేస్ట్!
- కాల్చిన మటన్‌కు యమ క్రేజీ
- కురుమూర్తి జాతరలో ప్రత్యేకం

7

పురాతన కాలం నాటి ఆలయాలను పరిరక్షించుకోవాలి



జటప్రోలులో 16వ శతాబ్ది నాటి దీప స్తంభాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ శివనాగిరెడ్డి

పెంట్లవెల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలం నాటి ఆలయాలను పరిరక్షించుకోవాలని పురావస్తు పరిశోధకుడు డాక్టర్ శివనాగిరెడ్డి అన్నారు. సోమవారం పెంట్లవెల్లి మండల పరిధిలోని మల్లేశ్వరం, జటప్రోలు గ్రామంలో ఆలయ సముదాయాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వం మల్లేశ్వరం గ్రామంలో కృష్ణానది నీటి ముంపునకు గురైన ఆలయాలను జటప్రోలు మదనగోపాలస్వామి ఆలయ సమీపంలో 30కి పైగా గుళ్లను ఏర్పాటు చేశారని వారు పేర్కొన్నారు. ఈ గుళ్లు కాకతీయ, విజయనగరం, సంస్థానం నాటి శిల్పాలన్నారు. ఈ శిల్పాలు 16వ శతాబ్దం నాటి దీపస్తంభం నిర్లక్ష్యంగా మదన గోపాలస్వామి ఆలయానికి ఎదురుగా పడి ఉండటం గమనించి అపురూప శిల్పాలతో చెక్కిన ఈ ద్వీప స్తంభమును ఆలయ సమీపానికి తరలించి ఒక పీఠంపై నిలబెడుతామన్నారు. ఆలయ పరిసరాల ప్రాంతాలలో నిర్లక్ష్యంగా పడి ఉన్న రాతి శిల్పాలపై నాగదేవతలు, నందులు, విగ్రహాలు చెక్కినటువంటి ఆలయ విడిభాగాలను ఒక చోటికి చేర్చి పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు ప్రారంభం

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కురుమూర్తి స్వామి జాతరకు సోమవారం నుంచి స్థానిక బస్టాండ్ నుంచి ఆర్టీసీ అధికారులు బస్సులను ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ 10 ప్లాట్ ఫారం సమీపంలో టెంట్లు వేసి భక్తుల కోసం బస్సులను ఏర్పాటు చేశారు. సోమవారం భక్తులను జాతరకు తరలించేందు కు 20 బస్సులు, మంగళవా రం 40 బస్సులు, బుధవా రం 20 బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తుల ఒత్తిడి అధికంగా ఉంటే బస్సుల సంఖ్యను పెంచడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. మంగళవారం ఉద్దాలోత్సవం ఉన్నందున భక్తులు అధిక సంఖ్యలో వచ్చే వీలు ఉన్నందున బస్సులను పెంచేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్ డిపోతో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, కొల్లా పూర్, నారాయణపేట డిపోల నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులు ఈ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాగుంట వెంకన్న ఆలయం హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

కేటీదొడ్డి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామంలోని కొండపై వెలసిన పాగుంట లక్ష్మీ వెంకటే శ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి హుండీని లెక్కించారు. దేవాదాయశాఖ గద్వాల డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరి, ఆలయ కార్యనిర్వహణాధికారి పురందర్ కుమార్, గ్రామ పెద్దలు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించా రు. 11 నెలలకు గాను నోట్ల ద్వారా రూ.10,25,075 ఆదాయం రాగా, నాణేల ద్వారా రూ. 1,01,217 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం హుండీ ఆదాయం రూ.11,26,292 వచ్చిందన్నారు. హుండీ లెక్కింపులో వెండి, బంగారం ఏమీ రాలేదని, గత సంవత్సరం హుండీ ఆదాయంతో పోల్చితే ఈ సంవత్సరం రూ.1,47,070 ఎక్కువగా వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కల్యాణలక్ష్మీ చెక్కు పొందిన వారిపై కేసు

» పెద్దజట్రం గ్రామంలో వెలుగులోకి వచ్చిన సంఘటన

ఊట్కూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి అయిన వారికి తాజాగా పెళ్లి చేసినట్లు పత్రికలను కొట్టించి తప్పుడు ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుని ఈ మధ్యకాలంలో కల్యాణలక్ష్మీ చెక్కులు పొందిన వారిపై కేసు నమోదైంది. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం గ్రామానికి చెందిన ఆడెం పద్మమ్మ, చాకలి దేవమ్మ, ఆడెం తిమ్మక్కలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవలే మండల కేంద్రంలో మంత్రి చేత మండలానికి చెందిన 250 మందికి షాదీముబారక్, కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దజట్రం గ్రామానికి చెందిన ఆడెం పద్మమ్మ, చాకలి దేవమ్మ, ఆడెం తిమ్మక్కలు చెక్కు తీసుకోవడానికి వచ్చినప్పుడు పేర్లు అడుగగా, తడబడుతూ అనుమానస్పదంగా వ్యవహరించారు. దీంతో పాటు గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వివాహం జరిగి చాలా రోజులు అయ్యిందని ,చెప్పడంతో ఆర్ఐ వెంకటేష్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఆడెం పదమ్మ తన కొడలు సంతోషను, ఆడెం తిమ్మక్క తన కోడలు లింగమ్మను కూతుర్లుగా చూపిస్తూ పెండ్లి పత్రికలను తయారు చేయించారు. తప్పుడు పత్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అలాగే చాకలి దేవమ్మ తన కూతురు నందిని గతంలో పెళ్లి చేసి కల్యాణలక్ష్మీ చెక్కు పొందిన అనంతరం మళ్లీ ఆధార్‌కార్డును మార్పు చేసి దరఖాస్తు చేయగా, అనంతరం చెక్కు రావడంతో వాటిని తీసుకోవడం జరిగింది. పెళ్లి జరగకున్నా జరిగినట్లు కొడలిని కూతురుగా చూపించి అక్రమంగా లబ్ధిపొందాలనే ఉద్దేశంతో చేశారని తెలుపడంతో ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌లో పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీల్లో.. పంచాయితీ!

- అధికార పార్టీ నాయకులు, గ్రామ కార్యదర్శుల మధ్య కోల్డ్‌వార్
- తాము చెప్పింది చేయాలంటున్న నాయకులు
- నిబంధనలకు విరుద్ధంగా చేస్తే మా ఉద్యోగాలు పోతాయంటున్న కార్యదర్శులు
- చేయకుంటే ఇంటికి పంపిస్తామంటూ హెచ్చరికలు



గ్రామ కార్యదర్శికి , అధికార పార్టీ నాయకుడి మధ్య గొడవ ఘటన (ఫైల్)

మహమ్మదాబాద్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీలో ప్రతీ చిన్న దానికి అధికార పార్టీ నాయలకులకు, గ్రామపంచాయతీ కార్యదర్శుల మధ్య ఎక్కడో చోట నిత్యం గొడవలు జరుగుతున్నాయి. తాము అధికారంలో ఉన్నాం... తమకు తెలియకుండా ఏ పని చేయవద్దు అంటూ మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు అధికార పార్టీ నాయకులు హుకూం జారీ చేస్తున్నారు. ఓ గ్రామంలో అధికార పార్టీ నాయకుడు ఇందిరమ్మ ఇంటి బిల్లు విషయంలో పాత ఇంటి బేస్మెట్లకు కూడా బిల్లు చేయాలని కార్యదర్శిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాడు.

కొత్తగా పెన్షన్ నమోదు చేసుకోవాలన్నా తమకు చెప్పిన తర్వాతే వారి పేర్లు నమోదు చేయాలని, లేదంటే ఉద్యోగానికి సెలవు పెట్టి వెళ్లమని హెచ్చరిస్తున్నారు. ...లేకుంటే తామే బదిలీ చేయిస్తామని మరీ పంచాయతీ కార్యాలయానికి వచ్చి గొడవకు దిగుతున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. కార్యదర్శులు సంతకాలు ఫోర్జరీ చేసి కొందరు నాయకులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించినా అడిగే నాథుడు లేడంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అధికార పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శుల మధ్య కోల్డ్‌వార్ నడుస్తున్నా మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి విషయం వెళ్లినా వారు మిన్నకుండి ఉంటుండటం గమనార్హం. దీంతో కొందరు పంచాయతీ కార్యదర్శులు ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు, మండల పరిధిలో ఇటీవల జరిగిన ఘటనలపై కార్యదర్శులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ఇప్పటికీ వాటిపై అతీగతీ లేదు. కేసులు పెడితే మీరు గ్రామంలో ఎలా పని చేస్తారో చూస్తామంటూ వారికి అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లకు గురి చేస్తున్నారు.

తాము చెప్పింది చేయాల్సిందే అంటున్న నాయకులు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొందరు నాయకులు తాము అధికారంలో ఉన్నాం.. మేం చెప్పిన పని చేయాల్సిందే... అంటూ వాదిస్తున్నారు. తమ కార్యకర్తలకు, తమ వెంట ఉన్న వారికి మా ప్రభుత్వం ఇస్తున్న అభివృద్ధి పనుల్లో భాగస్వామం చేసుకొని వారికే లబ్ధి చేకుర్చాలంటున్నారు. ఇతర పార్టీల నాయకులు వస్తే వారికి ఎలా పని చేస్తారంటూ ఇటీవల ఓ గ్రామంలో పంచాయతీ కార్యదర్శికి ఓ అధికార పార్టీ నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. బూతులు తిడుతూ ఆ పంచాయతీ కార్యదర్శిపై చేయి చేసుకున్నారు. దీంతో ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. దీన్ని కొందరు అధికార పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో కేసులు కాకుండా చూశారు. ఇప్పటికీ ఆ ఫిర్యాదు పెండింగ్‌లోనే ఉంది. మరో గ్రామంలో గ్రామకంఠంలో ఉన్న భూమి తనదేనని, తన పేరున ఉన్నట్లు రికార్డు రాయాలని కార్యదర్శిపై ఓ అధికార పార్టీ నాయకుడు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో సదరు కార్యదర్శి అలా చేస్తే తన ఉద్యోగం పోతుందని చెప్పాడు. దీంతో ఆ కార్యదర్శిని అక్కడి నుంచి బదిలీ చేయాలని మండల, జిల్లా అధికారులపై ఒత్తిడి పెంచారు. మరో గ్రామంలో గ్రామ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి ప్రైవేట్ బ్యాంకుల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ఆ వ్యక్తి ఇల్లు లేకున్నా ఉన్నట్లు సృష్టించి.. మరొకరి ఇంటిపై లోన్ తీసుకున్నారు. ఈ ఘటన వెనుక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉండే డాక్యుమెంట్ రైటర్ కీలకంగా వ్యవహరించాడు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రైవేట్ బ్యాంకుల నుంచి ఇంటిలోన్ ఇప్పించారు. అమాయకుల నుంచి 15 శాతం నుంచి 20 శాతం దాకా కమీషన్ దండుకున్నారు. కార్యదర్శుల ఫోర్జరీ సంతకాలపై మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు అయినా ఇప్పటికీ చర్యలు లేవు. మండల పరిధిలోని మరో గ్రామ పంచాయతీ పరిధిలో ఓ ప్రైవేట్ పని నిర్మాణానికి వెయ్యి ట్రాక్టర్ల పైనే మట్టిని రాత్రికిరాత్రే తరలించారు. కొన్ని చోట్ల ఇందిరమ్మ ఇళ్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉంటేనే ఇళ్లకు బేస్మెంట్ బిల్లు చెల్లించాలి.. కానీ కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి బిల్లు తీసుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే మండలంలో ప్రతీ గ్రామంలో నాయకులకు, కార్యదర్శుల మధ్య నిత్యం కోల్డ్‌వార్ జరుగుతూనే ఉన్నది.

సమస్యలు ఉన్నట్లు ఫిర్యాదులొచ్చాయి



మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చింది. కంచన్‌పల్లిలో జరిగిన ఘటన విషయంలో పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఆ కార్యదర్శిని మార్చమని తమ దృష్టికి కూడా తెచ్చారు. అది మా పరిధిలోనిది కాదని ఉన్నతాధికారులకు నివేదించాం. మండలంలో కార్యదర్శుల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై కూడా పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.

- నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో మహమ్మదాబాద్

విత్తనాల కోసం రోడ్డెక్కిన రైతులు

» అర్హులకే వేరుశనగ విత్తనాలు ఇవ్వాలంటూ ఆందోళన

» గంట పాటు నిలిచిన వాహనాలు



రైతులతో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్

పాన్‌గల్ ,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతీ రైతుకు ఉచిత వేరుశనగ విత్తనాలను మంజూరు చేయాలని బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ కన్వీనర్ అన్వేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గత నాలుగు రోజుల నుంచి వేరుశనగ విత్తనాలు ఇవ్వడం లేదని ప్రధాన చౌరస్తాలో రైతులతో కలిసి బీజేపీ నాయకులు గంటకు పైగా రాస్తారోకో చేపట్టారు. వనపర్తి నుంచి కొల్లాపూర్ కి వెళ్లే వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. మండలంలో అధికార పార్టీ నాయకులు మా ప్రభుత్వమే ఉచిత విత్తనాలు అందజేస్తున్నామని తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ తమ అనుచరులకు, కార్యకర్తలకే వేరుశనగ విత్తనాలను వ్యవసాయ అధికారులు ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులకు విత్తనాలు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట అవుతున్నా ఇప్పటి వరకు ఒక్క అధికారి కూడా కార్యాలయంలో లేకపోవడం ఏంటని వారు ప్రశ్నించారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని బీజేపీ నాయకులకు రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కానీ వ్యవసాయ అధికారుల హామీతోనే ధర్నా విరమింపజేస్తామని తేల్చి చెప్పడంతో అక్కడికి మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ చేరుకుని రైతులతో మాట్లాడారు. విత్తనాలను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఆయన హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమింపజేశారు. దళిత మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్, బీజేపీ నాయకులు రమేష్, రామకృష్ణ, నరేందర్‌రెడ్డి, డీసీ కురుమయ్య, వెంకట్‌సాగర్, రాము, నాగరాజు పాల్గొన్నారు.

చెరుకు టన్నుకు రూ.4,500 మద్దతు ధర ఇవ్వాలి

» తెలంగాణ చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపీ



కృష్ణవేణి ఫ్యాక్టరీ అధికారులను వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అమరచింత ,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా టన్ను చెరుకు బోనస్ కల్పకుండా ఫ్యాక్టరీ యజమానులు 4500 మద్దతు ధర ఇవ్వాలని తెలంగాణ చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపీ పేర్కొన్నారు. సోమవారం కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యజమానులకు రైతుల పక్షాన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్‌తో కలిసి డిమాండ్లతో కూ డిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది కృష్ణవేణి ఫ్యాక్టరీ పరిధిలో 4600 ఎకరాలు సాగు చేయగా ఫ్యాక్టరీ యజమానులు ప్రోత్సాహంలో ఈ ఏడాది 7800 ఎక రాల్లో చెరుకును రై తులు సాగు చేయ డం హర్షించదగ్గ విషయం అన్నారు. నవంబర్ మొదటి వారంలో చెరుకు కటింగ్ ప్రారంభిం చాలని దానికి తగి నంత లేబర్‌ను పంపాలని ఆయన డిమాండ్ చేశారు. 4600 మద్దతు ధరతో పాటు వేయి రూపాయల బోనస్ కలిపి ఇ వ్వాలని ఆయన కోరారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ప్రతి ఎకరాకు 30 వేల రూ పాయల లోన్ ఫ్యాక్టరీ ద్వారా ఇవ్వాలని ఆయన కోరారు. చెరుకు ఫ్యాక్టరీకి చేరిన 14 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని ఆయన కోరారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, వెం కటేష్ రాజు, వెంకట్రాములు, అంజిరెడ్డి, భా స్కర్‌రెడ్డి, ఆంజనేయులు, బాలునాయక్, త దితరులు ఉన్నారు.

పదిలో ఆరు టెండర్లు వాయిదా

అలంపూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ ఆలయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా టెండరు ప్రక్రియ జరుగుతున్నది. ఆలయాలలో నిర్వహించే కార్యకలాపాలన్నింటికీ టెండరు పద్ధతిన కాంట్రాక్టుదారులను పిలవడం ఆలయానికి లాభదాయకంతో పాటు పారదర్శకత ఏర్పడుతుందని పలువురు భక్తులు అంటున్నారు. సోమవారం పదింటికి సీల్డుకవరు టెండర్లు ఓపెన్ చేయగా, ఫొటోలు, వీడియోలు తీసేందుకు హరిబాబు, లైటింగ్ డెకరేషన్ చేసేందుకు రవి డిజిటల్ కర్నూలు, ఫ్లెక్సీ ప్రింటింగ్ కొరకు ప్రింట్ వరల్డ్ కర్నూలు, సీసీటీవీల ఏర్పాటు నిర్వహణ కొరకు జై దుర్గాభవానీ హైదరాబాదు వారు తక్కువకు కోట్ చేసి దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మిగతా వాటిలో నాలుగింటికి సరైన కొటేషన్లు ఇవ్వనందుకు, మిగతా రెండింటికి ఎవరు దాఖలు చేయనందుకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.



సీల్డు కవర్ల నుంచి టెండరు పత్రాలను తీస్తున్న ఆలయ సిబ్బంది

కోస్గి పోలీసు క్వార్టర్స్‌లో కుటుంబాలు భద్రమేనా?

» శిథిలావస్థలో ఉన్నాయని ఉన్నతాధికారులకు నివేదిక



శిథిలావస్థలో కోస్గి పోలీస్ క్వార్టర్స్

కోస్గి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్వార్టర్స్‌లో సిబ్బంది కుటుంబాలు భద్రంగానే ఉన్నారా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఇందుకు కారణాలు లేకపోలేదు.. గతంలో ఉన్నతాధికారులు ఈ క్వార్టర్స్ (భవనాలను) తనిఖీచేసి శిథిలావస్థకు చేరినట్లు నిర్ధారించారు. ఇక్కడ పోలీసు కుటుంబాలు ఉండటం అంత మంచిదికాదని నివేదిక ఇస్తూ పోలీసులకు హెచ్ఆర్ లేకుండా చేసింది. హెచ్ఆర్ లేదని పోలీసు సిబ్బంది ఎగబడి ఈ భవనంలో ఉండటానికి పోటీ పడుతున్నారు. ఈ భవనం 1998-99 ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి హయాంలో దుద్యాల మండలం పోలేపల్లికి చెందిన వెంకటయ్య అనే కాంట్రాక్టర్ సుమారు రూ.80 లక్షల నిధులతో నిర్మించారు. గతంలో కొందరు ఇక్కడ ఉండటానికి స్థానిక ఉన్నతాధికారులతో కొందరిని ఖాళీ చేయించేందుకు పైరవీ చేశారు కూడా. ఉన్నతాధికారులు పర్యవేక్షించి ఈ పోలీసు క్వార్టర్స్‌లో ఉండటం భద్రమేనా అన్న విషయంపై ఆరా తీయాలని పలువురు కోరుతున్నారు.

ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని తోటి పోలీసులే ప్రశ్నిస్తుండటం గమనార్హం. అయితే, 2019 సంవత్సరంలో అప్పటి నారాయణపేట ఎస్పీ చేతన్ తనిఖీ చేసి ఈ భవనం శిథిలావస్థలో ఉందని, సిబ్బందికి హెచ్ఆర్ కట్ చేయరాదని ప్రభుత్వానికి నివేదిక పంపారు. కాగా, పోలీసు క్వార్టర్స్‌లో ఇక్కడినుంచి బదిలీ అయిన అధికారులు సైతం ఇదే క్వార్టర్స్‌లో ఉంటున్నారు. గతంలో కోస్గి పోలీస్‌స్టేషన్ అంటే హెచ్ఆర్ కట్టవుతుందని, ఎవరూ ఇక్కడకు రావడానికి భయపడేవారు. కానీ ఇప్పుడు ఉచిత భవనమని అందరూ ఇక్కడకు వచ్చేందుకు ఇష్టపడుతున్నారు. కానీ ఇది శిథిలావస్థలో ఉందన్న విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నూతనంగా కోస్గి పోలీసు నూతన భవనం, క్వార్టర్స్ నిర్మించేందుకు స్థలం గుర్తించాలని ఆదేశాలిచ్చింది.

తాత్కాలికంగా సిబ్బంది ఉంటున్నారు

కుటుంబాలకు హెచ్ఆర్ కట్ కావడం లేదు. కుటుంబాలు ఉండవద్దని చెప్పాం. తాత్కాలికంగా రెస్ట్‌కోసం కొందరు ఉంటున్నారు.. తప్ప మరొకరు ఉండవద్దన్నాం.

- సీఐ సైదులు

కోటకొండ చేనేతకు జాతీయ స్థాయిలో గుర్తింపునకు కృషి

» బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



కోటకొండలో చేనేత చీరలను పరిశీలిస్తున్న బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు

నారాయణపేటరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చేనేత వృత్తి అద్భుతమని కోటకొండ చేనేత చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు అన్నారు. సోమవారం నారాయణపేట మండలంలోని కోటకొండ గ్రామంలో చేనేత కార్మికులు నేస్తున్న చీరలను ఆయన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్, దేవరకద్ర నియోజక వర్గ నాయకుడు ఎగ్గని నర్సింములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటకొండలో చేనేత కార్మికులు అద్భుత కళను ప్రదర్శిస్తున్నారన్నారు. ఇక్కడ తయారు చేసిన చేనేత వస్త్రాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు గాను కృషి చేస్తానన్నారు. ఇంకా ఇక్కడ పంచెలు తయారు చేసి విక్రయించాలన్నారు. రాష్ట్రంలో పేరుగాంచిన వివిధ ప్రాంతాల మాదిరగానే కోటకొండ బ్రాండ్‌గా తయారు కావాలన్నారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు ఇంట్లో తయారు చేసిన చేనేత, పట్టు చీరలను వారు పరిశీలించారు. గద్వాల, పైఠాన్, సికో తదితర రకాల పట్టు చీరలను వారు పరిశీలించారు. వీటికి సినిమా స్టార్‌లతో ప్రచారం చేద్దామన్నారు. కోటకొండ లేక హైదరాబాద్‌లో షో ఏర్పాటు చేద్దామన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి, నాయకులు ఎంగలిసిద్దు, పి.రవి, కృష్ణయ్య, నవీన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు దాటితే ఎంజాయ్!

» శివారు ప్రాంతాల్లో మందుబాబుల సిట్టింగ్

» మద్యం మత్తులోనే ప్రమాదాలు



బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న మద్యం ప్రియులు (ఫైల్)

గద్వాల క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంతో జిల్లాలోని పలు శివారు ప్రాంతాల్లో రాత్రి ఏడు దాటితే మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ఆదివారం మాత్రం మధ్యాహ్నం నుంచే సిట్టింగ్‌లు మొదలవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని నదిఅగ్రహారం వైపు, జమ్మిచేడులోని జమ్ములమ్మ దేవాలయం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో, ఆర్డీవో కార్యాలయ సమీపంలో, దాని వెనుక భాగంలో, చెనుగోనిపల్లి రూట్, హౌసింగ్ బోర్డులోని పీజేపీ కాలువ పక్కన, పిల్లిగుండ్లకు వెళ్లేదారిలో, అయిజ రోడ్ వైపు ఉన్న ఖాళీప్లాట్లలో, ధరూర్ మెట్ వైపు ఉన్న బ్రిడ్జి సమీపంలో, దౌదర్‌పల్లి శివారులో, విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుకభాగంలో, నది అగ్రహారంవైపు ఉన్న ఆంజనేయ ఆలయం పక్కన ఖాళీ ప్లాట్లతో పాటు దేవాలయం వైపు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టలపై కూర్చొని మద్యం తాగుతున్నారు. ఖాళీసీసాలు ఎక్కడపడితే అక్కడ వదిలేస్తున్నారని పాదచారులు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం తాగి అతివేగం, అజాగ్రత్తగా వాహనాలను నడుపుతున్నారు.

దీనివల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల అయిజ వెళ్లే దారిలో దౌదర్‌పల్లికి చెందిన ఓ యువకుడు మద్యం మత్తులోనే అయిజ మండలంలోని పులికల్‌కు చెందిన ఓ మోటార్‌బైక్ వ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో మృత్యువాత పడిన సంఘటన తెలిసిందే.

జాగింగ్‌కు వెళ్లేటప్పుడు ఇబ్బంది



శివారుప్రాంతాల్లో మద్యంతాగి బాటిళ్లను అలాగే వదిలేయడం, పగులగొట్టడం చేస్తున్నారు. దీనివల్ల జాగింగ్ వెళ్లినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం పాదచారులు, వాకింగ్ చేసేవారికి ఇబ్బందులు తప్పడంలేదు. పోలీసులు చర్యలు తీసుకోవాలి.

- వెంకటాద్రినాయుడు, గద్వాల

బహిరంగ ప్రదేశాల్లో తాగితే చర్యలు



పట్టణ శివారు ప్రాంతాల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవు. ఇప్పటికే చాలామందిపై కేసులు కూడా నమోదు చేశాం. మద్యంతాగి వాహనాలు నడిపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణ శివారులో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తాం. కేసులు నమోదు చేస్తాం.

- మొగులయ్య, డీఎస్పీ, గద్వాల

క్రైం కార్నర్

బైక్ పైనుంచి కిందపడి వ్యక్తి మృతి


మొట్టి నర్సిములు (ఫైల్)

నర్వ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి కిందపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా నర్వ మండలం ఉందెకోడ్ గ్రామంలో గత వారం రోజుల క్రితం ఉందెకోడ్ నుంచి మరికల్ వెళ్లే రోడ్డులో గాజులయ్య తండా వాసులు ఇరువైపులా ఉన్న చెట్లకు పశువులను కట్టి వేశారు. బైక్‌పై వెళ్తున్న మొట్టి నర్సిములు (52) అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అతడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైతులు నిర్లక్ష్యంగా రోడ్డుకిరువైపులా చెట్లకు పశువులను కట్టి వేయడం వలన ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మున్ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మొట్టి నర్సింహులు గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా కొంతకాలంగా పని చేస్తున్నాడు. ఇప్పుడు అతను మరణించడంతో కుటుంబ సభ్యులు పెద్ద దిక్కు కోల్పోయిందని వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్య

- అప్పులోళ్లు వేధించడంతోనే అఘాయిత్యం చేసుకున్నాడని ఆరోపణ


దుబ్బ లక్ష్మన్న(ఫైల్)

గద్వాల క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పులోళ్లు ఇంటిమీదకు వచ్చి వేధించడం, అప్పు ఇస్తావా.. లేదా ఇంటికి తాళం వేయాలా అంటూ వేధించడంతో దుబ్బ లక్ష్మన్న(62) సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్‌లో చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గతంలో గంజ్ మార్కెట్‌యార్డ్‌లో వ్యాపారం చేసి నష్టపోయారు. నష్టపోయాక వ్యాపారం మానేసి ఇంటిదగ్గరే ఉంటున్నాడు. వ్యాపారం బంద్ చేసిన తర్వాత కూడా కొంత అప్పులు తీసుకొని కడుతుండేవాడు. అయితే ఇటీవలే అప్పులు కట్టకపోవడంతో ఆదివారం రాత్రి కొందరు అప్పులోళ్లు ఇంటిమీదకు వచ్చి గొడవకు దిగారు. అప్పు కట్టకపోతే ఇక్కడినుంచి వెళ్లబోమని భీష్మించుకొని కూర్చున్నారు. అంతేగాక అప్పులు కట్టకపోతే ఇంటికి తాళం వేస్తామని చెప్పడం, గట్టిగా కాలనీలో అరవడంతో మనస్తాపానికి గురయ్యారు. ఇలాగైనా త్వరలోనే పూర్తి అప్పు ఇస్తానని చెప్పడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. అయితే అప్పులోళ్ల వేధింపులకు మనస్తాపానికి గురైన దుబ్బలక్ష్మన్న ఇంటిలో భార్య పడుకున్న వెంటనే ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సోమవారం ఉదయం లేచేసరికి తన భర్త వేళాడుతుండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు భార్య జయమ్మ తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

బావిలో పడి వృద్ధురాలు..

ఎర్రవల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లి మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో సోమవారం రాత్రి బావిలో పడి వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడింది. కోదండాపురం ఎస్సై మురళి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిరుపాలమ్మ(70) కల్లు తాగుతూ.. మానసికంగా సరిగ్గాలేక గ్రామంలో తిరుగుతూ ఉండేదని, సోమవారం రాత్రి తన బంధువైన రామచంద్రమ్మ ఇంటికి వెళతానని చెప్పింది. గ్రామంలో ఉన్న ఊరబావిలో పడి మృతి చెందినట్లు మంగళవారం గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తన తల్లి మృతిపై ఎలాంటి అనుమానాలులేవని కుమారుడు తిక్కారెడ్డి ఫిర్యాదు చేశాడని ఎస్‌ఐ తెలిపారు.

నిద్రలోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిన మహిళ

- ఆసుపత్రికి తరలించే లోపు తనువు చాలింపు

తాడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నిద్రపోతున్న మహిళ నిద్రలోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిన మహిళను గుర్తించిన భర్త ఆసుపత్రికి తరలించే సరికి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... కడ్తాల్ మండలం ముద్వేన్ గ్రామానికి చెందిన మంజుల, ఈశ్వరయ్య దంపతుల మొదటి సంతానం పూజిత(22)కు గత నాలుగు సంవత్సరాల క్రితం తాడూరు మండలం సిర్సవాడ గ్రామానికి చెందిన యాదగిరితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు చిన్నారులు. అయితే ఆదివారం రాత్రి యథావిధిగా నిద్రించిన వారు తెల్లవారుజామున 4:30గంటలకు లేచిన భర్త యాదగిరిని చూడగా అప్పటికే అపస్మారక స్థితిలోకి పూజిత వెళ్లిన విషయాన్ని గుర్తించి వెంటనే నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పూజిత మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె మృతి పట్ల అనుమానం ఉందంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి అనుమానాస్పద స్థితిలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పూర్వాపరాలు పరిశీలిస్తామన్నారు.

ఆత్మహత్య కేసులో వ్యక్తి రిమాండ్

ఏదుల(గోపాల్‌పేట), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏదుల రిజర్వాయర్ పనులు చేస్తున్న సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని ఓ ఆత్మహత్య కేసులో రిమాండ్ చేశారు. పదేపదే వేధింపులకు విసిగి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకొని, చికిత్స పొందుతూ మృతి చెందిన ఏదులకు చెందిన కొమ్ము ఆంజనేయులు (50) కేసులో సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. ఈ మేరకు కోర్టులో శ్రీనివాస్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు, అనంతరం మహబూబ్‌నగర్ జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనంపై కేసు

కల్వకుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల సమీపంలోని గుర్తు తెలియని వాహనం ఢీకొని కల్వకుర్తి పట్టణంలోని బలరాంనగర్‌కు చెందిన ఈశ్వర్‌రెడ్డి మృతిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఈ నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఈశ్వర్‌రెడ్డి మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో ఉంచినట్లు ఎస్‌ఐ తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈశ్వర్‌రెడ్డి బంధువులు ఎవరైనా మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఎస్‌ఐ కోరారు.

గండీడ్ కేజీబీవీ ఎస్‌వోకు షోకాజ్ నోటీసు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గండీడ్ మండల కేంద్రంలోని కేజీబీవీ ఆవరణ అపరిశుభ్రంగా ఉందని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహించిన కేజీబీవీ ఎస్‌వోకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు మహబూబ్‌నగర్ విద్యాశాఖ అధికారి ఎ.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కేజీబీవీని అదనపు కలెక్టర్ మధుసుదన్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో మురుగునీరు కేజీబీవీ ఆవరణలో ఆగిఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసి, షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈవోను ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ మేరకు నోటీసులు ఇచ్చారు.

సైబర్ మోసం - 99 వేలు కోల్పోయిన వ్యక్తి

వెల్దండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన వాన తిర్పతయ్య అనే వ్యక్తి ఖాతా నుంచి సైబర్ మోసగాళ్లు రూ.99వేలు తస్కరించారు. వివరాల్లోకి వెళితే.. తిర్పతయ్య తన ఇంట్లో ఉన్న సన్ డైరెక్ట్ టీవీ రీచార్జ్ చేసేందుకుగాను గూగుల్‌లో వెతకగా కనిపించిన టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేశాడు. దీంతో స్పందించిన అవతలి వ్యక్తికి రీచార్జ్ గురించి తెలపగా, టీవీ ఆన్‌చేసి ఉంచాలని సూచించాడు. అదే సమయంలో తన మొబైల్ నెంబర్‌నుంచి రీచార్జ్ చేసుకోవాలని సూచించాడు. కాగా రీచార్జ్ ఫెయిల్ అయ్యింది. విషయాన్ని అవతలి వ్యక్తికి తెలుపగా లైన్‌లోనే ఉండాలని చెప్పాడు. సుమారు 20 నిమిషాల అనంతరం అనుమానం వచ్చి ఫోన్ కట్‌చేసి అకౌంట్‌లో చూసుకోగా, రూ.99 వేలు 7029418174 నెంబరుకు ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై 1930కు ఫోన్‌చేసి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తిర్పతయ్య తెలిపాడు. బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపాడు.

మత్స్య సంపద మటాష్!

- అలివి వలలతో వైజాగ్ మాఫియా జల్లెడ
- బోట్ల ద్వారా ఏపీ శివార్లకు తరలింపు
- అక్కడి నుంచి పట్టణాలకు...
- ఏటా కోట్లాది మత్స్య దోపిడీ
- నెల రోజులుగా జరుగుతున్నా పట్టించుకోని పరిస్థితి
- సహకరిస్తున్న స్థానిక అధికార యంత్రాంగం, నాయకులు


వైజాగ్‌నుంచి తెచ్చుకున్న బోట్లలో అలివి వలలో నదిలోకి వెళ్తున్న జాలర్లు

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఓ వైపు మత్స్య సంపద పెంచాలన్న ఉద్దేశంతో ఏటా చెరువుల్లో, నదుల్లో చిన్నచేపలను విడిచి మత్స్యకారులకు ఊరటనిచ్చే కార్యక్రమం చేపట్టింది. కానీ మరో వైపు అదే ప్రభుత్వం స్థానిక యంత్రాంగం, గ్రామస్థాయి లీడర్లు చేపపిల్లల చోరీకి సహకరిస్తూ మత్స్య సంపదను వైజాగ్ మత్స్య మాఫియకు దోచి పెడుతున్నారు. దీంతో ఏటా వందల కోట్లు విలువైన చిన్నచేపలు అలివి వలలకు చిక్కి శల్యమవుతోంది. దీని వల్ల తెలంగాణ మత్స్య సంపదకు తీవ్రమైన నష్టం వాటిల్లుతున్నది. వాస్తవానికి అలివి వలను వాడటం తెలంగాణలో నిషేధం. కానీ ఏటా కృష్ణానదిలో దొంగచాటుగా వాడుతూ అడ్డొచ్చినవారికి అమ్యామ్యాలిస్తూ అలివి వలను యథేచ్ఛగా వాడుతున్న తతంగంపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న కథనం.

నదులపై వైజాగ్ మత్స్య మాఫియా కన్ను!

కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మంగళూరు జిల్లాలో తుంగ, భద్ర నదులు కలిసి అలంపూరు వరకు ప్రయాణించి అక్కడ కృష్ణలో కలుస్తుంది. సరిగ్గా ఈ ప్రాంతంపైనే వైజాగ్ మత్స్య మాఫియా కన్ను పడింది. గత పాతికేళ్లుగా ప్రతీ ఏటా నవంబరు మాసంలో వచ్చి సుమారు మూడునెలల పాటు ఇక్కడే మకాం వేసి నిషేధించపడ్డ అలివి వలలు వేస్తుంటారు. ఈ ఏడాది కూడా నదీతీర గ్రామాలలోని మత్స్యకారుల సాయంతో ఆయా గ్రామపెద్దలను కలిసి చేతులు తడిపి, వీరి సాయంతో అధికార యంత్రాంగాన్ని కూడా మచ్చిక చేసుకున్నట్లు సమాచారం. ఇదే ధైర్యంతోనే మత్స్య మాఫియా వందలాది మంది కూలీలతో నందికొట్కూరు, సిద్దేశ్వరం, ఆత్మకూరు పరిసరాలలోకి లారీలలో చేరుకుని అక్కడి నుంచి వీరి వెంట అలివి వలతో పాటు తెచుకున్న బోట్ల సాయంతో తెలంగాణలోని కొల్లాపూర్, అలంపూరు, గొందిమల్ల ప్రాంతాలకు సుమారు 600మంది చేరుకున్నారు. గత నెల రోజులుగా నదీ తీరాల్లోనే గుడారులు వేసుకుని ఉండవల్లి మండలం మారమునగాల, శేరుపల్లి, అలంపూరు మండలాల్లోని క్యాతూరు, ఉట్కూరు, భీమవరం, గొందిమల్ల, కాకర్లతిప్ప తదితర ప్రాంతాల్లోని కృష్ణానదిని 600 మంది 20గ్రూపులుగా ఏర్పడి అలివి వలతో జల్లెడ పడుతున్నారు.

మత్స్య సంపద దోపిడీ

ఒక్కొక్క వల నుంచి సుమారు 300కిలోల చేపపిల్లలు వస్తున్నాయి. వీటన్నింటిని నదితీరంలో వారం రోజులపాటు ఆరబెడతారు. అక్కడి నుంచి ఎండిపోయిన చేపలను మరబోటులోకి చేర్చి అక్కడి నుంచి ఏపీ ప్రాంతంలోని సిద్దేశ్వరం, ఆత్మకూరు, నందికొట్కూరు, కొడిదేల, ముచ్చుమర్రి ఏరియాలకు నదిలోనే తరలించి అక్కడి నుంచి సిద్ధంగా ఉంచిన లారీల్లో విజయవాడ, అనంతపూర్, కలకత్తా, హైదరాబాదుకు తరలిస్తున్నారు. ఇలా ఒక రోజు 10టన్నుల చేప నది నుంచి బయటకు తీసి తరలిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎండిన చేప కిలో నాణ్యతను బట్టి 400 నుంచి 600 దాకా పలుకుతుంది. వీటితో పాటు అలివి వలలకు చిక్కుకున్న పెద్దచేపలు, రొయ్య సంపదను కూడా దోచేస్తున్నారు. ఈ లెక్కన రోజుకు లక్షలాది విలువైన మత్స్యసంపద తీరం దాటిపోతున్నది.

అనామకులే కూలీలు...

అలివి మాఫియా చేస్తున్న దందాలో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. వైజాగ్‌కు చెందిన ఈ మాఫియా అలివి వలలు వేసేందుకు నేర్పరులు కొందరిని మాత్రమే తెస్తారు. వీరికి తోడుగా మానవ రవాణా చేస్తూ కూలీలుగా మార్చుతున్నట్లు తెలిసింది. ఇలా వచ్చే క్రమంలో రోడ్డువెంట, రైల్వేస్టేషన్‌లో, దేవాలయాలలో నిద్రించే అభాగ్యులను వాహనాలలో బలవంతంగా ఎక్కించి ఫోన్లు లాక్కుని ఇక్కడకు తరలించి బలవంతంగా వారితో పని చేయిస్తున్నట్లు తెలిసింది. ఇలా వచ్చిన అనామకులకు కేవలం రెండుపూటల భోజనం పెట్టి వెట్టిచాకిరి చేయిస్తూ వారి కష్టాన్ని కూడా దోచేస్తున్నారని స్థానికులు తెలిపారు. నీటిలో ఉంటూ గాయాలపాలై, చీములు, రక్తాలు కారినా పని చేయించడం వల్ల కొందరు మృతి చెందుతున్నారని, ఇలా వచ్చిన వారిలో గతేడాది నలుగురు మృత్యువాత పడ్డారని, వారిని నదీతీరంలోనే పూడ్చివేశారని సమీపంలో రైతులు, పల్లెప్రజలు తెలిపారు.

అందరికీ తెలుసు



ప్రతీ ఏటా కృష్ణానదిలో చేపలు పట్టేటోళ్లు వస్తూనే ఉన్నారు. ఈ విషయం అందరికీ తెలుసు. ఓ వైపు ప్రభుత్వం చేపపిల్లలు వదులుతుంటే మరోవైపు అవే చేపపిల్లలను అలివి వలలు వేసి పట్టేస్తున్నారు. వారంరోజుల గుడ్డుచేపను కూడా పడుతున్నారు. దీని వల్ల నదిలో ఉండే జీవరాశులకు కూడా ముప్పే. కానీ ఏం చేస్తాం. అందరూ సహకరిస్తుంటే. మాకు జీవనోపాధి కష్టం అవుతుందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- లక్ష్మణ్‌నాయుడు, గొందిమల్ల గ్రామం

పర్యావరణానికి హాని కలిగిస్తే ఉపేక్షించేది లేదు..

అలివి వల వాడటం వల్ల పర్యావరణానికి హాని కలిగే ఆవకాశం ఉం ది. పర్యావరణానికి నష్టం చేకూరిస్తే చట్టపర మైన చర్యలుంటాయి. నదిలో అలివి వలలపై ఫి ర్యాదులు అందితే వాటితో పాటు బోట్లు సీజ్ చేసి కారకులపై కేసులు నమోదు చేస్తాం.

- మొగులయ్య, డీఎస్పీ, గద్వాల

పరిశీలిస్తాం ..

అలివి వలలు మన రాష్ట్రంలో నిషేధించపడ్డాయి. దీనివల్ల మత్స్య సంపదతో పాటు పర్యవరణానికి హాని కలిగే అవకాశం ఉంది. సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలిస్తాం. సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయించి చర్యలు తీసుకుంటాం.

- షేక్ షకీలభానో, మత్స్యశాఖ అధికారి గద్వాల

పటేల్ ఆశయ సాధనకు పాటుపడదాం

- 31న స్టేడియం గ్రౌండ్ నుంచి 8 కిలో మీటర్ల ఏక్తా మార్చ్
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశసమైక్యత కోసం పోరాడిన మహనీయుడు ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు పాటుపడదామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు.

సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎంపీ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు ఈ నెల 31న నిర్వహించే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకను అందరూ ఏకమై ఉక్ భారత్ లక్ష్యన్ని సాధిద్దామన్నారు. ఆయన 150 జయంతిని అధికారికంగా నిర్వ హించాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. పాలమూరులోని స్టేడియం గ్రౌండ్ నుంచి తెలంగాణ చౌరస్తా, గడియారం, అశోక్ టాకీస్ చౌరస్తా మీదుగా పిల్లల మర్రి వరకు 8 కిలోమీటర్ల ఏక్తా మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 31 నుంచి నవంబరు 25 వరకు ఏక్తా యాత్రలు నిర్వహించను న్నట్లు తెలిపారు. పాల మూరులోని మేరా యువ భారత్ కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీని వాస్‌రెడ్డి, మైభారత్ కేంద్రం ఇన్‌చార్జి కోటా నాయక్, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు చిల్లా గాల్ రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు అంతకుముందు ఏక్తా ర్యాలీకి సబంధించిన పోస్టర్ ఆవిష్క రించారు.

రైల్వే సమస్యలపై దృష్టిపెట్టండి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ పరిధిలోని రైల్వే సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకొని పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సూచించారు సోమవారం ఎంపీ క్యాంపు కార్యలయంలో రైల్వే అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. మహబూబ్‌నగర్ , దేవరకద్ర , పనపర్తి జిల్లాల పరిధిలోని పలు రైల్వే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుచ్చారు. పెండింగ్ పనులు పూర్తిచేయాలన్నారు. పాలమూరు జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ రిటైనింగ్ వాల్ స్థానికుల అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఆత్మకూర్ దేవరపల్లి వద్ద రైల్వే ట్రాక్ కింద నుంచి మంచినీటి పైపులైన్ నిర్మాణానికి అధికారులకు అనుమతులు ఇవ్వాలన్నారు.

పోలేపల్లి మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు నోటీసులు

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ నిధులను అవకతవకలకు పాల్పడిన పోలేపల్లి మాజీ సర్పంచ్ చేతన రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లావణ్యల నుంచి రూ.1.71కోట్ల నిధులను రికవరీ చేయాలని జడ్చర్ల తహసీల్దార్‌కు ఈ నెల 25న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అవే ఉత్తర్వులను సోమవారం జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్‌లకు గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ అందచేయడానికి వెళ్లారు. మాజీ సర్పంచ్ అందుబాటులో లేకపోవడంతో పోస్టుద్వారా పంపించారు. మాజీ ఉప సర్పంచ్ లావణ్యకు అందచేశారు. గ్రామపంచాయతీలో నిధులు అవకతవకలు అయ్యాయని గత సంవత్సరం డీఎల్‌పీవో విచారణలో బహిర్గతం అయ్యాయి. ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ ప్రకారం నిధులు రికవరీ చేయాలంటూ పేర్కొన్నారు.

పాఠశాలలో వస్తువులు చిందరం

- స్టాఫ్‌రూమ్‌లో రెండు ఫ్యాన్లు ధ్వంసం చేసిన దుండగులు

కొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో గదికి ఉన్న తాళం పగులగొట్టి స్టాఫ్‌రూమ్‌లో రెండు ఫ్యాన్లను ధ్వంసం చేసిన ఘటన కొత్తపల్లి మండలం భూనీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చోటు చేసు కుంది. ఆదివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో ఇదే అదునుగా భావించిన దుండగులు గేటు నుంచి లోపలికి ప్రవేశించి రెండు ఫ్యాన్లను ధ్వంసం చేసి, బీ రువాలో వస్తువులను చిందరవందరం చేశారు. సోమవారం ఉదయం పాఠశాలను శుభ్రం చేయడానికి వచ్చిన స్కావెంజర్ చంద్రమ్మ గమనించి వెంటనే హెచ్‌ఎం నీలిమకు సమాచారం అందించారు. దీంతో ఆమె కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోట్ల మహేందర్‌రెడ్డి, స్థానికంగా ఉన్న యువకులను సమాచారం ఇచ్చారు. వారితో సమావేశమై మాట్లాడిన ఆమె పాఠశాలకు రాత్రి సమయంలో ఎవరు వస్తున్నారో గమనించాలని కోరారు.

మసాలాతో మస్త్ టేస్ట్!

- కురుమూర్తి జాతరలో ప్రత్యేకం
- కాల్చిన మటన్‌కు యమ క్రేజీ
- అమరచింత అరె కటిక కులస్థుల ప్రత్యేక తయారీ


కురుమూర్తి జాతర కోసం వాడే స్పెషల్ మసాలా


మటన్ కాలుస్తున్న వ్యాపారి (ఫైల్)

అమరచింత, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రతీది ఓ ప్రత్యేకమే. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులు కురుమూర్తి గుట్ట లోని కాంచన గుహలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి గుట్టపై నుంచి కిందికి దిగిన వెంటనే నోరూరించే మటన్ దుకాణాల వైపు పరుగులు తీస్తుంటారు. కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్ తినడానికి ఒక తెలంగాణ రాష్ట్రం నుంచే కాక పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల లక్షల మధ్య అక్కడికి వస్తుంటారు. సహజంగా కాల్చిన మటన్, మటన్ ఫ్రై ఎక్కడైనా దొరుకుతుంది.. కానీ ఎక్కడా లేని నోరూరించే రుచి మాత్రం ఒక్క కురుమూర్తి జాతరలో లభిస్తుంది.

మసాలా ప్రత్యేకత

కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్‌కు ఇంతగా క్రేజీ రావడానికి ఇందులో కలిపే మసాలానే ప్రత్యేకం. ఈ మసాలా తయారీలోను ఓ ప్రత్యేకత ఉంది. తరతరాలుగా జాతరలో మటన్ దుకాణాలను అమరచింత ఆరె కటికె కులస్థులు వ్యాపారం చేయడం జరుగుతుంది. కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు ముందు దసరా నవరాత్రుల తరువాత మటన్‌లో కలిపే మసాలాను తయారు చేసుకుని 50 రోజుల దాకా ఘాటు ఎక్కడానికి నిల్వ ఉంచుతారు. మటన్ దుకాణాలు వేసుకునే ప్రతీ వ్యాపారి నెల రోజులకు పైగా జాతరలో ఒక్కొక్కరు 100 యాటలు (జీవాలను) కోస్తారు. ఇందుకు గాను ఒక్కొక్కరు 150 కేజీల ప్రత్యేకంగా తయారు చేసి మసాలాను వాడుతారు. నవరాత్రుల అనంతరం ఆరె కటికె వ్యాపారులు నిష్ఠతో ప్రత్యేక ప్రార్థనలతో చేసి మసాలా తయారీని ప్రారంభిస్తారు. ఈ మసాలాలో కారం 35 కేజీలు, అల్లం 30 కేజీలు, ఎల్లిపాయలు 30 కేజీలు, లవంగాలు ఒక కేజీ, యాలకులు ఒక కేజీ, రాతి పువ్వు, మరాఠి మొగ్గ, జాపత్రి, జాజికాయ పొప్పాయి పూత ఇలా 15 రకాల వస్తువులను కలిపి 150 కేజీల ప్రత్యేక మసాలాను తయారు చేస్తారు. అత్యంత జాగ్రత్త నిష్ఠతో మసాలా తయారు ఉంటుంది. అన్ని వస్తువులు సమానంగా కలిపి 50 రోజుల దాకా ప్రత్యేక పాత్రలో మసాలా మగ్గడానికి నిల్వ ఉంచడం జరుగుతుంది. ఇలా ప్రత్యేకంగా తయారీ మసాలాను కురుమూర్తి స్వామి జాతరలో ఉపయోగిస్తారు. కురుమూర్తి జాతరలో మటన్ ప్రత్యేకం కావడానికి ప్రత్యేక మసాలా కలుపడం ఓ ప్రత్యేకమే అని చెప్పవచ్చు.

పరేడ్‌కు కంటింజెంట్ ఆఫీసర్‌గా పీయూ అధ్యాపకుడు ఎంపిక గర్వకారణం

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్


ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌ఎన్ అర్జున్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లు పరమేశ్వర్, పద్మావతిలను అభినందిస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వేడుకలలో నిర్వహించే పరేడ్‌కు కంటింజెంట్ ఆఫీసర్‌గా పీయూ అధ్యపకుడు ఎంపిక కావడం గర్వకారణమని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పాలమూరు యూనివర్సిటీలోని పరిపాలన భవనం వీసీ చాంబర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లు బాగా పనిచేసి గణతంత్ర దినోత్సవ శిబిరాలకు హాజరు కావాలని ఆదేశించారు.

దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి వలంటీర్‌లు పాల్గొంటారని, భిన్నత్వంలో ఏకత్వంగా చాటాలని, యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. డాక్టర్ ఎస్‌ఎన్ అర్జున్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లు మాల్ జీడీసీ నుంచి పరమేశ్వర్, గద్వాల, టీఎస్‌ఆర్‌డీసీ పిల్లలమర్రి నుంచి పద్మావతితో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది వలంటీర్‌లు గణతంత్ర వేడుకలలో నిర్వహించే పరేడ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 9 వరకు గుజరాత్ రాష్ట్రం పటాన్‌లోని హేమచంద్రాయ నార్త్ గుజరాత్ యూనివర్సిటీలో జరిగే ప్రీ-రిపబ్లిక్ డే శిబిరానికి హాజరవుతారని ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ తెలిపారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

గద్వాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతున్నది. సోమవారం ప్రాజెక్టులోకి 75,593 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, ఎడమ విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కూగా ప్రస్తుతం 198.36 టీఎంసీల నిల్వ ఉన్నది. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి జూరాలకు 23వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 23,151క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 46వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 43వేల క్యూసెక్కులను శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.

ఆరు యూనిట్ల ద్వారా జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి ప్రియ దర్శిని జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా వరద వస్తున్న కారణంగా ఎ గువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో ఆరు యూనిట్లను ప్రారంభించే విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్ల ద్వారా 2.4845 వి ద్యుత్ ఉత్పత్తిని చేపట్టగా ఇప్పటి వరకు 455.532 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్ప త్తి కేంద్రంలో మూడు యూనిట్ల ప్రారంభించి 2.698 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 443.997 మిలియన్ యూని ట్లను చేపట్టినట్లు తెలిపారు. ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి ఇదే అత్యుత్తమ ఉత్పత్తి అని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టులోని అధికారుల అందరి సహకారంతోనే రికార్డు స్థాయి ఉత్పత్తిని నెలకొల్పామని ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

తెగిపడిన విద్యుత్ వైరు

నవాబ్‌పేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోమాల గ్రామంలో సోమవారం మందుల గోపాల్‌కు చెందిన మేకలను తన ఇంటి సమీపంలో ఉన్న మేకల దొడ్డిలో కట్టేశాడు. మధ్యాహ్నం 11 కేవీ విద్యుత్ లైన్ వైరు తెగిపడి మేకపై పడటంతో మేకపోతు మృతి చెందగా, రూ.20 వేల నష్టం వాటిలినట్లు బాధితుడు తెలిపారు.

ఘనంగా సీతాదయాకర్‌రెడ్డి జన్మదినం

చిన్నచింతకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్కాపూర్‌లో సోమవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్ పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.

సేవాభావం కలిగి ఉండాలి

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు సేవాభావం కలిగి ఉండటంతో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సంగీత పేర్కొన్నారు. సోమవారం జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లిలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. కో-ఆర్డినేటర్ ప్రసన్నలక్ష్మి, శ్రీలక్ష్మి, సోని, హెచ్ఎం జయప్రకాష్, ఉపాధ్యాయులు నాగరాజు, ప్రసూన, ఆనందం పాల్గొన్నారు.

ఈపీఎఫ్ బెనిఫిట్స్ అందించాలి

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఈపీఎఫ్ బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకోవాలంటూ సోమవారం హైదరాబాద్‌లోని ఈపీఎఫ్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శివకు జడ్చర్ల మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్, కృష్ణ, ఇందిరమ్మ వినతిపత్రం అందచేశారు. మునిసిపాలిటీలో పనిచేస్తూ 44 మంది కార్మికులు మృతి చెందారని, వీరికి రావలసిని బెనిఫిట్స్ అందలేదని వివరించారు.

నేటి నుంచి జనం బాట

పాలమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళ, బుధవారాల్లో జనంబాట నిర్వహించనున్నట్లు తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు మారయ్య, సురేందర్, ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రెండురోజుల పాటు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. మొదట జడ్చర్ల ఉందండాపురం నుంచి మీనాంబరం అక్కడి నుంచి కర్వెన ప్రాజెక్టు అప్పంపల్లి అమరవీరుల స్థూపం నివాళి అర్పించి, కురుమూర్తి నుంచి మహబూబ్‌నగర్ చేరుకుంటారని తెలిపారు. 29న కుల సంఘాలతో జిల్లా కేంద్రంలోని సుదర్శన్ కన్వెన్షన్‌లో నిర్వహించే ములాఖత్‌లో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అయ్యప్ప స్వాములకు సన్మానం

భూత్పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్‌కు చెందిన అయ్యప్ప స్వాములు మునిరంగస్వామి ఆలయం నుంచి శబరిమలై వరకు మహా పాదయాత్ర చేస్తున్న సందర్భంగా స్వాములకు మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ శాలువాతో సత్కరించారు. అదే విధంగా సికింద్రాబాద్ నుంచి శబరికి పాదయాత్రగా వెళ్తున్న 500 మంది స్వాములకు అన్నదానం, అల్పాహారం అందజేయడానికి లిక్కి నవీన్‌గౌడ్ రూ.25 వేలు అందజేశారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన

మహమ్మదాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు మహిళా పోలీసుల చేత అవగాహన కల్పించారు. గుడ్ టచ్ అనేది సురక్షితమైన స్పర్శ అని ఉదాహరణకు కౌగిలింత, అదే బ్యాడ్ టచ్ అనేది అసౌకర్యమైన అవాంఛనీయమైనది బలవంతమైనదని అర్థం అని వివరించారు.

కొనసాగిన ధాన్యం కొనుగోళ్లు

దేవరకద్ర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర మార్కెట్ యార్డులో సోమవారం ధాన్యం కొనుగోళ్లు కొనసాగాయి. పెద్ద హంస 348 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.1,801, కనిష్ఠంగా రూ.1,765, ఆర్ఎస్ఆర్ 234 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.2,400, కనిష్ఠంగా రూ.2,130 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

డీసీసీ నియామకాలపై మాట మార్చిన కాంగ్రెస్

పాలమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : డీసీసీ నియామకాలపై కాంగ్రెస్ మాట మార్చి బీసీలకు అన్యాయం చేయాలని చూస్తోందని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాప్రతినిధుల బంధువులకు, వారి కుటుంబాలకు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లకు డీసీసీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పడంపై అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్ మరోసారి రెడ్డిల పార్టీగా మారుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మాటలు చూస్తుంటే మరోసారి బీసీలకు అన్యాయం చేసేందుకు కుట్ర జరుగుతోందని అర్థమవుతోందన్నారు.

రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు

» ఎంపీ డీకే అరుణ

» ఎమ్మెల్యే యెన్నంతో కలిసి పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు దళారుల చేతులో మోసపోకుండా కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం అప్పాయిపల్లి గ్రామంలోని బాలాజీ ఇండస్ట్రీస్ వద్ద సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పత్తి 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110, తేమ 9 శాతం ఉంటే రూ.8,020 మద్దతు ధర పొందవచ్చు అన్నారు. 12 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అంతకుముందు నగరంలోని పంచముఖికాలనీలో రూ.38 లక్షల మునిసిపల్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరులో గతంలో ఎన్నడూ లేని విధంగా కాలనీల్లో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులు సిరాజ్ ఖాద్రి, తిరుమల వెంకటేశ్, ఖాజాపాష, రఘురాంరెడ్డి, రఘు, రామేశ్వర్‌రెడ్డి, ఆంనేయులుగౌడ్, ఏడీఏ రాంపాల్, ఏవో శృతి, ఏఈవో శివాని పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని.. సద్వినియోగం చేసుకోవాలి

» ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి **»** మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



బాదేపల్లి మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల/నవాబ్‌పేట/మిడ్జిల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. బాదేపల్లి పత్తి మార్కెట్‌లో బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో, నవాబ్‌పేట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంతో పాటు మిడ్జిల్ మండలం చిలువేరు గ్రామ శివారులోని కాటన్ మిటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి, మాట్లాడారు. 14 తేమ శాతంతో వ్యర్థ పదార్థాలు, ఇతర తిండి గింజలు లేకుండా తీసుకొస్తే క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర ఇవ్వనున్నట్లు తెలిపారు. జడ్చర్ల మునిసిపాలిటీ నాగసాల సమీపంలో ఆరు ఎకరాల అసైన్డ్ భూమిని రైతు నుంచి ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని, అనంతరం ఆ స్థలం బాదేపల్లి పీఏసీఎస్‌కు కేటాయించినట్లు ఎమ్మెల్యేకు బాదేపల్లి పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. కాగా ఆ స్థలం బాదేపల్లి పీఏసీఎస్ పేరుపైకి మారలేదని, ప్రస్తుతం సీసీఎల్ఏలో పెండింగ్‌లో ఉందని, పీఏసీఎస్ పేరు వచ్చేలా మార్పు చేయించాలంటూ ఎమ్మెల్యేను కోరారు. దీంతో సీసీఎల్ఏ పెండింగ్‌లో ఉన్న అంశంపై అందరం కలిసి వెళ్దామని, పీఏసీఎస్ పేరుపైకి మారేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతకుముందు నవాబ్‌పేట మండలం రుద్రారంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు మిడ్జిల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, నవాబ్‌పేట మార్కెట్ చైర్మన్ హరలింగం, వైస్ చైర్మన్ తులసీరాం, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, భూపాల్‌రెడ్డి, హమీద్ మహేక్, నవాజ్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మిడ్జిల్‌లో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రబ్బాని, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గౌస్, వెంకటయ్య, ప్రశాంత్‌రెడ్డి, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, జహీర్, అశోక్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నవంబర్ మొదటి వారం నుంచి ధాన్యం మార్కెట్‌లోకి రావచ్చని అంచనా దృష్ట్యా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఐడీవోసీ కార్యాలయంలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్ల మరియు తుఫాను ప్రభావం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారుల సమావేశం నిర్వహించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు తుఫాను ప్రభావం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పాటించవలసిన సూచనలుపై అవగాహన కలిగించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మధుసూదన్‌నాయక్, డీఆర్డీవో నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎం రవినాయక్, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్, జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్‌పాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తు ప్రధానోపాధ్యాయుల పైనే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : విద్యార్థులు భవిష్యత్తు ఉపాధ్యాయులపైనే ఉందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రధానోపాధ్యాయుల హ్యాండ్ బుక్‌ను కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో టీఎస్‌జీహెచ్ఎం కలసి కలెక్టర్, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు బైకాని బాలుయాదవ్, అధ్యక్షుడు అనంతప్ప, ప్రధాన కార్యదర్శి జగదీష్‌కుమార్, కోశాధికారి అబ్దుల్‌హక్, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు ఇవ్వాలి



పాపిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అనంత రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమం కోసం, వారి ఆరోగ్యం కోసం అదనంగా రూ.100 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనంతరెడ్డి కోరారు. సోమవారం ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ బసవరాజ్‌తో కలిసి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ న్యాయ కార్యదర్శి పాపిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్, నూతన నోటరీల నియామకంతో పాటు స్టేషన్ బెయిల్ రద్దు వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వ దృష్టికి సమస్యలు తీసుకవెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి ఆయన పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి..

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ మహబూబ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2024 మార్చి నుంచి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెన్షన్ బకాయిలు చెల్లించలేదని వినతిలో పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఆవరణలో నిరసన తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బాలస్వామి, అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్వర్, వెంకటస్వామి, సురేష్ కుమార్, వామన్‌కుమార్ ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని సోమవారం పాలమూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సౌమ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నరేష్ తేజ మాట్లాడుతూ విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, విద్యారంగ అభివృద్ధి కృషి చేస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. విద్యారంగానికి గత బడ్జెట్‌లో 7శాతం నిధులు కేటాయించిందని మండిపడ్డారు. వాటిని కూడా పూర్తి స్థాయిలో ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 90శాతం ఉన్నారని వారంతా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మీద ఆధారపడి విద్యనభ్యసిస్తున్నారన్నారు. ప్రభుత్వం రూ.86 వేల కోట్లు నిధులు పెండింగ్‌లో ఉంచిందన్నారు. జిల్లా కన్వీనర్ సౌమ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలల కాలంలో గురుకులాల్లో 83 మంది విద్యార్థులు మరణించారని, ఈ మరణాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

360 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్

మహబూబ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు హాజరవుతున్న శతమానం విద్యార్థులు మెరిట్ స్కాలర్ షిప్ సాధించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో శతమానం పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఆయన, 360 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయాలని వలంటీర్లకు సూచించారు. నవంబరు 23న ఈ పరీక్ష జరుగుతుందని, ఇందులో ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు సంవత్సరానికి రూ12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. వచ్చేనెల 9 నుంచి విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, టాప్ 100 మంది విద్యార్థులకు నవంబరు 12 నుంచి నవంబరు 22 వరకు 10 రోజుల పాటు రెసిన్షియల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, గోపాల్‌యాదవ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ ఒక గేటు ఎత్తివేత

దేవరకద్ర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఒక గేటు ఫీటు మేర ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు నీటి పారుదల ఈఈ ప్రతాప్ సింగ్ తెలిపారు. సోమవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 32.3 అడుగులకు చేరుకుంది.

కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజపై భౌతిక దాడికి పాల్పడిని కానిస్టేబుల్ బాలునాయుడును సస్పెండ్ చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా అధ్యక్షులు రవీందర్, ప్రధానకార్యదర్శి ప్రభాకర్ ఒక సంయుక్త ప్రకటలో డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సరోజపై చేయి చేసుకోవడం దారుణం అన్నారు.

మూసాపేట ఎంఈవోగా నాగయ్య

మూసాపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోల్కంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల జీహెచ్ఎం నాగయ్య మూసాపేట ఎంఈవోగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన రాజేశ్వర్ రెడ్డి పదవీ విరమణ పొందడంతో పోస్టు ఖాళీగా మారింది. ఎంఈవో నాగయ్య మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డుపై నిలిచిన నీరు తొలగింపు



నీటిని తొలగిస్తున్న అధికారులు

గండీడ్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచలింగాలతండా గ్రామ పంచాయతీలో రోడ్డుపై నిలిచిన నీరు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో తహసీల్దార్ స్పందించారు. సోమవారం మహమ్మదాబాద్ పోలీసులకు సమాచారమిచ్చి వారిని అక్కడికి పంపించారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి పోలీసులు ఎక్స్‌కవేటర్ సహాయంతో మట్టిని తీసి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించారు.

విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



ఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ యాజమాన్యం గత నెల 29న విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యూటీ డిఫరెన్స్ బకాయిలు చెల్లించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, ఉపాధ్యక్షుడు జీబీపాల్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సంతోష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక రీజనల్ మేనేజర్ కార్యాలయంలో ఆర్ఎం సంతోష్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనేక మంది విశ్రాంత ఉద్యోగులు 34 సంవత్సరాల కన్న ఎక్కువ సర్వీస్ చేశారని, అందుకు గ్రాట్యూటీ ఎక్కువ చెల్లించామని, కాని సంస్థకే బాకీ ఉన్నారని గతంలో ప్రభుత్వం విడుదల చేసిన ఒక నెల సకలజనుల సమ్మె వేతనాన్ని బాకీ కింద జమ చేసుకున్నారని ఇది సమంజసం కాదన్నారు. సంయుక్త కార్యదర్శి అంజన్న, ప్రచార కార్యదర్శి బీహెచ్. కుమార్, నర్సింహులు, పర్సనల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్నలో విత్తన శుద్ధితో కత్తెర పురుగు ఉధృతి తగ్గించవచ్చని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఏఆర్ఎస్ మొక్కజొన్న పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ సునీల్ సూచించారు. మండలంలోని గంగాపురంలో సోమవారం ఎన్‌కె 6802 రకం మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయితో పరిశీలించారు. కత్తెర పురుగు నివారణ చర్యల గురించి వివరించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్, ఏవో గోపీనాథ్, ఏఈవో శేఖర్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ విద్యానగర్‌కాలనీలో రోడ్డు నెంబరు 7, 9లో సోమవారం రాత్రి హైమాస్ట్ లైట్లను కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. కాలనీ అధ్యక్షుడు ఖుర్షీద్ పాల్గొన్నారు.

వరద కాల్వల నిర్మాణానికి శాటిలైట్ సర్వే పూర్తి

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో వరద కాల్వల నిర్మాణానికి శాటిలైట్ సర్వే పూర్తయ్యిందని, నివేదిక వచ్చిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు పడిన సందర్భంగా రోడ్లపైకి వరద నీరు చేరుతుండడంతో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి వరద కాల్వల నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేయించారన్నారు. పనులకు సంబంధించిన టెండర్ పూర్తి కాగా, శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అయితే పల్లపు ప్రాంతాలను గుర్తించేందుకు చేపట్టిన శాటిలైట్ సర్వే రెండు రోజుల క్రితమే పూర్తయ్యిందని, నివేదికలు వచ్చిన వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే టీఎఫ్ఐడీసీ నిధులు రూ.7 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు 80 శాతం పూర్తయ్యాయని, కాంట్రాక్టర్ వ్యక్తిగత కారణాలతో ఆలస్యమైందన్నారు.

ఐజేయూ విజయంపై హర్షం



కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఐజేయూ నాయకులు

పాలమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) విజయకేతం ఎగురవేయటంతో మహబూబ్‌నగర్ జిల్లాలో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కేక్ కట్ చేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ మద్దతుతో ఫ్రెండ్స్ ప్యానెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ప్యానెల్ గెలుపొందటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కాటం నాగరాజుగౌడ్, సతీష్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్‌ను అభివృదిధ చేసి సభ్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కృషి చేస్తుందన్నారు. చిక్కా వెంకటరమణ, శ్రీనివాస్, మేహరాజు, విజయ్ కుమార్, గోకులం వెంకటేష్, అనిల్, శ్రీకాంత్, శివ, హసన్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

» కత్తెర కృష్ణయ్యకు సస్పెండ్ చేసే అధికారం లేదు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవాబ్‌పేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా మండలంలో కార్యకర్తలకు అండగా ఉండి వారికి ఆర్థిక సహకారం అందించడంతో పాటు అభ్యర్థుల గెలుపునకు నిరంతరం కృషి చేసిన జనంపల్లి సోదరులపై ధార భాస్కర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీరటి రాంచంద్రయ్య, మార్కెట్ చైర్మన్ హరలింగం, వైస్ చైర్మన్ తులసీరాం, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పుణ్యమా అంటూ చాలా మంది సర్పంచులు, ఎంపీటీసీలుగా ఎదిగారన్నారు. రాజాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య మాజీ డీసీసీ అధికార ప్రతినిధిని ఎలా సస్పెండ్ చేస్తారన్నారు. నవాజ్‌రెడ్డి, హమీద్ మహేక్, ఆళ్ల భూపాల్‌రెడ్డి, వాసుయాదవ్, సురేష్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్, వెంకటయ్య, బాలరాజు, సురేందర్, శివకుమార్, నరేష్, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్, సత్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయలేదు..

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయలేదని, కొందరు నాయకులు వారి వెంట ఉండి మాట్లాడిస్తున్నారని, కార్యకర్తలకు ఇబ్బందులు ఎదురైతేనే మాట్లాడానని ధార భాస్కర్ పేర్కొన్నారు. తన వ్యక్తిగత కాల్ డేటా తీస్తే తన హక్కులకు భంగం కలుగుతోందని, తనపై తప్పుడు కేసులు పెట్టించారని త్వరలో వివరాలు వెల్లడిస్తానన్నారు.